క్లుప్తంగా

గ్రంథాలయం ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న సర్పంచ్ రాంబాబు

తెర్లాం: మండలంలోని రంగప్పవలసలో గ్రంథాలయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అవసరమైన పోటీ పరీక్షల పుస్తకాలు, వార్తా పత్రికలు అందుబాటులో ఉండేందుకు గ్రంథాలయం అవసరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా గ్రంథాలయం ఏర్పాటుకు సహకరిస్తామని ముందుకు వచ్చారు.

చురుగ్గా రోడ్డు నిర్మాణం



ప్రొక్లెయినర్‌తో రోడ్డు చదును పనులు

వంగర: మండలంలోని రుషింగి–కొప్పరవలస గ్రామాల మధ్య గ్రావెల్ రోడ్డు నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతోంది. నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉండే ఈ రోడ్డు అంతా గోతుల మయం కావడంతో సర్పంచ్ యలకల శ్రీనివాసరావు పర్యవేక్షణలో పంచాయతీ నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నారు. త్వరితగతిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని ఇంజినీరింగ్ అసిస్టెంట్ గెంబలి సురేష్ తెలిపారు.

ఆదర్శ రైతుగా విశ్వనాథం



ఆదర్శరైతు అవార్డు అందుకుంటుటున్న విశ్వనాథం

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామానికి చెందిన రైతు చోడవరపు విశ్వనాథం తనకున్న 12 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడని వక్తలు కొనియాడారు. ఈ మేరకు గుంటూరులో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా రైతునేస్తం అనే స్వచ్ఛంద సంస్థ విశ్వనాథంను ఆదర్శరైతుగా ఎంపిక చేసి ఆదివారం సన్మానించింది. మంత్రి అచ్చెన్నాయుడు అవార్డు అందజేశారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, తెర్లాం హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ప్రసన్న అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పుస్తక పఠనాన్ని విద్యార్థులు తప్పనిసరిగా చేయాలన్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు, వార్తా పత్రికలు చదవాలని సూచించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌లో ప్రతి విద్యార్థి చేరాలని కోరారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ మోడల్ టెస్ట్ రేపు

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు బి.బాలమోహనరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎం.ఎస్.చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఈ పరీక్షకు రావాలనుకునే వారు మధ్యాహ్నం 12 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తొలి ఐదుగురికి బహుమతులతో పాటు నగదు బహుమతి, మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 7989929915ను సంప్రదించాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం!

- రాజాం వాసులను వెంటాడుతున్న తాగునీటి సమస్య
- పండగ వేళల్లోనూ నీటి సరఫరాకు అంతరాయం
- రోడ్డు విస్తరణ పనుల్లో పైపులైన్ మరమ్మతులతో దుస్థితి
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా అధికారుల పనులు
- రెండు రోజులుగా తాగునీటి కోసం ప్రజల అవస్థలు

రాజాం: మున్సిపాలిటీలోని ప్రజలకు రానురాను ఇబ్బందులు అధికమవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇటీవల కాలంలో పట్టణంలోని ప్రజలంతా మౌలిక వసతుల సమస్యలతో సతమతమవుతున్నారు. ఒకసారి అపారిశుధ్యం, మరోసారి తాగునీటి కొరత, ఇంకోసారి విద్యుత్ కోతలు ఇలా రోజుకో సమస్య పట్టణవాసులను తీవ్రంగా వేధిస్తున్నాయి. మున్సిపల్ అధికారుల్లో సమన్వయ లోపం, నిర్లక్ష్యం.. ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

నిలిచిన తాగునీటి సరఫరా..

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య వస్తే.. అలాంటి సమయంలో అక్కడి చెరువులు, నేల బావులు, బోరుబావులు ప్రత్యామ్నాయంగా కనిపిస్తాయి. అదే పట్టణాల్లో తాగునీటి సమస్య ఏర్పడితే ప్రజలకు వచ్చే కష్టం అంతా ఇంతా కాదు. ఇప్పుడు సరిగ్గా అటువంటి సమస్యే.. రాజాం మున్సిపాలిటీలో తాండవం చేస్తోంది. గత రెండు రోజులుగా పట్టణ వాసులను తాగునీటి సమస్య వెంటాడుతోంది. రాజాంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి జీఎంఆర్ ఐటీ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా జీఎంఆర్ ఐటీ, డోలపేట చెక్‌పోస్టు ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నారు. దీంతో పట్టణ వాసులకు రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఇదే విషయంపై ముందస్తు సమాచారం ఇచ్చి, ప్రజలను అప్రమత్తం చేయకపోవడంతో పాటు కనీసం ప్రత్యామ్నాయ చర్యలు కూడా అధికారులు చేపట్టకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఎలాగైనా తాగునీటి సమస్య నుంచి బయటపడాలన్న ఉద్దేశ్యంతో సమీప గ్రామాల్లోని బోరు బావులు, నేలబావులు, చెరువులను కొంతమంది ఆశ్రయిస్తే.. మరికొంతమంది తాగునీటి కోసం ఫిల్టర్ వాటర్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అయితే ఈ ఫిల్టర్ వాటర్ కేంద్రాలు కూడా లైసెన్స్‌లు లేనివి కావడం విశేషం.

ఎప్పటికప్పుడే తాగునీటి సమస్య

రాజాంలో ఎప్పటికప్పుడే తాగునీటి సమస్యలు నెలకొంటున్నాయి. గతంలో ఇదే మాదిరి సమస్య వచ్చినప్పుడు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి కూడా లేదు. ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా నీటి సరఫరాకు అంతరాయం కలిగించే పనులు చేపట్టడం సరికాదు. ఈ మధ్యకాలంలో విద్యుత్ కోతలు కూడా అధికమయ్యాయి. రోడ్డు విస్తరణ పేరుతో ప్రతీ రెండు, మూడు రోజులకోసారి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు.



ఫిల్టర్ వాటర్ కేంద్రాల వద్ద తాగునీటి కోసం క్యూలైన్‌లో పట్టణవాసులు

సమన్వయలోపం..

ఇటీవల మున్సిపల్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు పడకేశాయి. మున్సిపల్ అడ్మినిస్ట్రేట్‌కు సంబంధించి, కమిషనర్‌తో పాటు ఇతర శాఖల మధ్య సమన్వయలోపం బాగా కనిపిస్తోంది. కార్యాలయంలో పనిచేసే ఇంజినీరింగ్, శానిటేషన్‌తో పాటు అనుసంధానంగా ఉన్న ఎలక్ట్రికల్, ఆర్‌అండ్‌బీ శాఖల మధ్య సయోధ్య అటకెక్కింది. ప్రధానంగా రహదారి విస్తరణ పనుల్లో ఆర్‌అండ్‌బీ అధికారుల అంచనాలు, మున్సిపల్ ఇంజినీరింగ్, తాగునీటి సరఫరా, పబ్లిక్ శానిటేషన్ శాఖల మధ్య స్పష్టమైన అవగాహన కనిపించడం లేదు. మున్సిపల్ అధికారులకు తెలియకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేయడం, వారికి తెలియకుండా విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్‌స్తంభాలు మార్చడం, కొత్త లైన్లు వేయడం, వీరికి తెలియకుండా పబ్లిక్ శానిటేషన్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు తాగునీటి సరఫరాలో సమయపాలన చేయకపోవడం జరుగుతోంది. దీంతో ఒక్కో జు పట్టణంలో సగానికి పైగా వార్డులకు విద్యుత్ సరఫరా ఉండకపోవడం, తాగునీటి సరఫరా లేకపోవడం వంటివి జరుగుతోంది. మరోవైపు రోడ్డు విస్తరణ పనులు మందగించడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి, ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. దీంతో అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. వారి మధ్య అవగాహన లేకపోతే తమను ఇబ్బంది పెట్టాలా అని నిలదీస్తున్నారు.



రాజాంలో జరుగుతున్న తాగునీటి పైపులైన్ మరమ్మతులు

ఇబ్బందులు లేకుండా చర్యలు..

రోడ్డు విస్తరణ పనులతో పాటు విద్యుత్ లైన్ల మార్పుల కారణంగా రాజాం పట్టణంలో రెండు రోజుల పాటు తాగునీటి సమస్య ఎదుర్కోవాల్సి వచ్చింది. సోమవారం నుంచి తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నాం. భవిష్యత్‌లో కూడా మరెన్నడూ ఇటువంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నాం.

పి.వెంకట్, మున్సిపల్ ఏఈ, రాజాం

పరామర్శ



అప్పలనరసయ్యను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండలంలోని కొతారిపురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మొయిల అప్పలనరసయ్యను పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం పరామర్శించారు. అనారోగ్యం కారణంగా ఇటీవల ఓ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న అప్పలనరసయ్య తన ఇంటి వద్ద చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న డాక్టర్ రాజేష్.. ఆ గ్రామానికి వెళ్లి, ఆయన ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలకు రోడ్లు



డి.గదబవలస శ్మశాన వాటికకు వెళ్లేందుకు నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ నిధులు, గ్రామస్తుల విరాళాలతో శ్మశానవాటికలకు రహదారులు నిర్మిస్తున్నారు. మండలంలోని డి.గదబవలసలో సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో శ్మశానవాటికకు సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. గతంలో శ్మశానవాటికకు రహదారి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం రోడ్డు పనులు జరుగుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని పాములవలస గ్రామానికి చెందిన అమరపు సురేష్ తన సొంత నిధులతో గ్రామంలోని శ్మశానవాటికకు రోడ్డు, అభివృద్ధి పనులు చేపడుతున్నారు.

ప్రజలకు మేలు చేసే సేవలందించాలి



మాట్లాడుతున్న సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు సునీల్‌కుమార్ రాథో

- సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు వీవీఎస్ఎస్ సునీల్‌కుమార్ రాథో

రేగిడి: భగవాన్ సత్యసాయిబాబా సేవా సంస్థల ద్వారా ప్రజలకు మేలు చేసే సేవలందించాలని సత్యసాయి సేవాసంస్థల విజయనగరం జిల్లా అధ్యక్షుడు వీవీఎస్ఎస్ సునీల్‌కుమార్ రాథో అన్నారు. స్థానిక విశ్వసాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన భజన మండలి కన్వీనర్ల సమావేశానికి ఆయన హాజరై, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే మార్చి నెలలో జరిగే పర్తి యాత్ర విధివిధానాలు వివరించారు. బాబా శతజయంతి సందర్భంగా వంద గ్రామ సేవలు చేయాలని, ప్రతీ భజన మండలిలో బాలవికాస్ కార్యక్రమాల తరగతులు నిర్వహించాలన్నారు. నిత్య నారాయణ సేవలు చేయాలని, ప్రశాంతి నిలయం సేవలకు గ్రామాల్లో మహిళలు, పురుషులు ఏడాదిలో ఒక్కసారైనా వెళ్లేలా చూడాలన్నారు. ప్రతీ గ్రామంలో నిత్యం రామనామ నగర సంకీర్తన చేపట్టాలన్నారు. అనంతరం రేగిడి సత్యసాయి భజన మండలి సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ సమన్వయకర్త మనోహర్, జోనల్ కో–ఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రంతో కత్తెర పురుగు నివారణ



వంగర: అగ్నిఅస్త్రం తయారీని వివరిస్తున్న దృశ్యం

వంగర: ప్రకృతి సేద్యంలో భాగంగా తయారు చేసే అగ్నిఅస్త్రంతో మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగును నివారించవచ్చని మరువాడ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తెలిపారు. మండలంలోని కింజంగి గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. సాగులో అధిక దిగుబడులకు ప్రకృతి సాగు విధానాలు అవలంబించాలని, రసాయనిక ఎరువులకు బదులు సహజ సిద్ధంగా తయారుచేసే కషాయాలను వినియోగించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ వేమిరెడ్డి పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు సోకే తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే కషాయాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రకృతి సేద్యంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యవంతమైన పంట వస్తాయన్నారు. ప్రతిఒక్కరూ ప్రకృతి సేద్యం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భుజంగరావు, ఎంపీటీసీ పిల్లా రోజ, అగ్రికల్చర్ అసిస్టెంట్ మహేష్, ప్రకతి వ్యవసాయం సిబ్బంది కె.పార్వతి, పి.గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టరు అపహరణపై కేసు నమోదు

రాజాం సిటీ: మండలంలోని రామానుజులపేటకు చెందిన పడాల వెంకటేష్ ట్రాక్టరు అపహరణపై ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్ఐ వై.రవికిరణ్ తెలిపారు. ఈ నెల 2వ తేదీన మొగిలివలస సమీపంలోని ఓ బంకు వద్ద ట్రాక్టరును ఉంచి, వెంకటేష్ ఇంటికి వెళ్లిపోయాడు. మరుసటి రోజు వచ్చి చూసే సరికి ట్రాక్టరు కనబడలేదని, అన్నిచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఫిర్యాదు చేశాడని ఎస్ఐ పేర్కొన్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



విద్యార్థుల ఆరోగ్యం తనిఖీ చేస్తున్న వైద్యుడు సునీల్‌కుమార్

రేగిడి: స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్ కుమార్ ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి మరీ విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీసి, వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతిఒక్కరూ మంచి ఆరోగ్యానికి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని, ఉతికిన బట్టలు వేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న స్థలం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసిన రెవెన్యూ అధికారులు

బొబ్బిలి రూరల్: మండలంలోని గున్నతోటవలస గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 19–1బి–1లో ఉన్న సుమారు 10 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఆ స్థలాన్ని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు ప్రభుత్వం కేటాయించగా.. పైనుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలు వెళ్తుండడంతో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. దీంతో అక్రమార్కుల కన్ను సుమారు 15 లక్షల విలువ చేసే ఆ స్థలంపై పడింది. అదును చూసి ఆ స్థలంలో చిక్కుడు, ఆకుకూరల మొక్కలు వేసి సొంత స్థలం అనే భావన కల్పించారు. దీనిపై స్థానికులు తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీనుకు ఆదివారం ఫిర్యాదు చేయగా.. ఆయన ఆదేశాల మేరకు వీఆర్‌ఓ పెదిరెడ్ల వెంకునాయుడు, సర్వేయర్ సునీల్, వీఆర్ఏ స్వాతి గ్రామానికి చేరుకుని స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

నకిలీ ఇళ్ల పట్టాలపై చర్యలు తీసుకోండి..



నకిలీ పట్టాలను ప్రదర్శిస్తున్న కోట అప్పన్న, మునకాల, తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాల వ్యవహారం జోరుగా సాగుతోందని, దీనిపై ఆధారాలు చూపినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట అప్పన్న, పట్టణ అధ్యక్షుడు మునకాల శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కాలనీలో ప్రభుత్వం పాతించిన హెచ్చరిక బోర్డులను కూడా పక్కన పెట్టేసి అక్రమార్కులు స్థలాలను నకిలీ పట్టాలతో ఆక్రమించుకుంటున్నారన్నారు. పూర్తి ఆధారాలు సమర్పించినా, అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ప్రొక్లయినర్‌తో ఓ రేకుల షెడ్డును తొలగించి చేతులు దులుపుకున్నారని తెలిపారు. పేదల కాలనీలో డ్యూప్లెక్స్ ఇళ్లు వెలుస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆటలో హోరాహోరీగా తలపడుతున్న జట్లు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ఆదివారం జరిగాయి. గ్రామానికి చెందిన శాసుబిల్లి సాయిశంకర్ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ పోటీలను గ్రామపెద్దలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో 12 మండలాల నుంచి 12 జట్లు పాల్గొని, తమ సత్తా చాటాయి. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా అగ్నిమాపక అధికారి జడ్డు మోహనరావు, గ్రామపెద్దలు పొగిరి లెనిన్, జడ్డు జగదీష్, జడ్డు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించరూ..



పూడికలతో నిండిపోయిన శ్రీరామ్‌నగర్ కాలనీలోని ప్రధాన కాలువ



మహంతి వీధిలో రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

రామభద్రపురం: మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ ప్రజలను దీర్ఘకాలంగా వేధిస్తున్న ప్రధాన సమస్య మురుగు. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎందరు పాలకులు మారినా మురుగు సమస్యకు పరిష్కారం చూపడం లేదు. బీసీ, ఎస్సీ వీధులకు మధ్య ప్రధాన కాలువ ఉంది. ఈ కాలువలో ప్రజలు వినియోగించిన వాడుక నీరు వచ్చి చేరుతుంది. అయితే అధికారులు కాలువ నిర్వహణను పట్టించుకోకపోవడంతో పూడికలు పేరుకుపోతున్నాయి. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. అధికారులు స్పందించి కాలువలో పూడికలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాజగోపాలనాయుడు

రాజాం: మండలంలోని పొగిరి గ్రామంలో ఉన్న లెప్రసీ నిర్మూలన కేంద్రంలోని రోగులకు వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు చేతులమీదుగా దాతలు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ వంతరాం చంద్రమౌళి.. తన మనవడు సాన్విక్‌సాయి వేదాంసు పుట్టినరోజు సందర్భంగా వాటిని వితరణ చేసినట్లు రాజగోపాలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుడు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పూలంగి సేవకు తరలిరండి

- ఎమ్మెల్యే బేబీ నాయన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన, తదితరులు

బొబ్బిలి: పురాతన దేవాలయం రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్న పూలంగి సేవ, తదితర కార్యక్రమాలకు భక్తులు తరలిరావాలని ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. త్రిదండి చినజియర్‌స్వామి ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. బేడా సేవ, తిరుప్పావై ఘోష్టి కార్యక్రమాలు సోమవారం ఉదయం 9 గంటలకు పూర్తవుతాయని అనంతరం మధ్యాహ్నం 1.30 గంటల వరకు.. తిరిగి సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 9.30 వరకు స్వామి దర్శనం ఉంటుందన్నారు. మంగళవారం 108 బుట్టలతో పుష్పయాగం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ యాగాన్ని భక్తులు కనులారా వీక్షించాలని కోరారు. కార్యక్రమంలో వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు, ఆధ్యాత్మిక సేవకులు సుంకరి సాయిరమేష్, తదితరులు పాల్గొన్నారు.